క్లుప్తంగా

## బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నేతలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేశ్

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బుధవారం రాత్రి అంబర్‌పేట డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్ పటేల్ ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నేతలు ఎమ్మెల్యే కాలేరు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిని స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, రామారావు యాదవ్, లింగారావు, లవంగం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం'

కవాడిగూడ: బీజేపీ కార్నర్ మీటింగ్‌లో వెలుగులోకి వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటం చేస్తామని బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం భోలక్‌పూర్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో 83 బీజేపీ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించామన్నారు. ప్రజలు రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్‌లు, పెన్షన్‌తో పాటు తాగునీరు, డ్రైనేజీ, అధ్వానంగా రోడ్ల సమస్యలపై ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు. వీటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ, జలమండలి కార్యాలయాల వద్ద ప్రజలతో కలిసి బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, ఈ.కృష్ణ, ఆర్.రవికుమార్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అశోక్



అంబర్‌పేట: అంబర్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా డి.అశోక్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఫలక్‌నామ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్ నగర కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఇక్కడకు వచ్చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన అశోక్ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చే దిశగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## అలరించిన వేణుగానం



నల్లకుంట: శ్రీరామ గాన సభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత ఉత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం సాయంత్రం చిల్లరిగి రాఘవ నారాయణ, చిల్లరిగి శివరామకృష్ణ సోదరులు ఆలపించిన కీర్తనలు ఎంతగానో అలరించాయి. అనంతరం కొమ్మెర్ల ఉమావెంకటేశ్వర్లు బృందంచే నిర్వహించిన వేణుగాణ కచేరి ఆహూతులను ఆద్యంతం అలరించింది. దీనికి మృదంగంపై కర్రా శ్రీనివాస్, కె.గణపతి రామ్ వయోలిన్‌పై జయసూర్య, కోలంక సాయి కుమార్ వాయిద్య సహకారమందించారు. చివరగా శ్రీ రామ గాన సభ కార్యదర్శి కొణికి శాయి శ్రీనివాస శర్మ సంగీత విద్వాంసులను శాలువాతో సన్మానించారు.

## రెయిన్‌బో అనాథాశ్రమంలో అన్నదానం




అన్నదానం చేస్తున్న డాక్టర్ హిప్నో పద్మకమలాకర్

ముషీరాబాద్: ముషీరాబాద్ రెయిన్‌బో అనాథాశ్రమంలో వన భారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డాక్టర్ హిప్నో పద్మకమలాకర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. పేద పిల్లలకు చేయూతనిచ్చి వారిని అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. నవ భారత లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నవ భారత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు వినయ్, నాయకులు సదాలక్ష్మి పాల్గొన్నారు.

# మోయలేని భారం

### గ్యాస్ ధరల పెంపుపై ధర్నాలు, రాస్తారోకోలు



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద.. హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో మోదీ ప్రభుత్వం గద్దె దించేంతా వరకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హెచ్చరించారు. గ్యాస్‌పై రూ.50 తాజాగా పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్ చౌరస్తాలో నిరసన ధర్నా, రాస్తారోకో, కట్టెల పొయ్యిపై వంటా వార్పు కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు గ్యాస్ ధర రూ.400 ఉందని, ఆయన వచ్చాక 14 సార్లు గ్యాస్ ధరలు పెంచి రూ.1155 చేరుకుందని విమర్శించారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, వివిధ డివిజన్ల అధ్యక్షులు మోజేస్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, నర్సింగ్‌ప్రసాద్, శ్యామ్‌ప్రసాద్, శ్రీనివాస్‌రావ, గ్రేటర్ నాయకులు ప్రభాకర్, సుధాకర్‌గుప్తా, రవియాదవ్, శంకర్‌ముదిరాజ్, చిట్టి పాల్గొన్నారు.

#### రాబోయే ఎన్నికల్లో మహిళలు బీజేపీకి బుద్ధి చెప్పాలి..

బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో మహిళలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సిరిగిరి శ్యామ్ ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక మహిళలతో కలిసి పెంచిన గ్యాస్ ధరల కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు కిరణ్, కార్తీక్‌యాదవ్, సిద్ధిఖీ, సత్యనారాయణ, అంజి, అమిత్, సాయియాదవ్, రవియాదవ్ ఉన్నారు.

#### రాంనగర్ చౌరస్తాలో..

చిక్కడపల్లి: గ్యాస్ ధరల పెంపు నిరసన కార్యక్రమానికి గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. రామ్‌నగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ నిర్వహించిన ధర్నాకు గాంధీనగర్ పార్టీ అధ్యక్షుడు రాకేశ్ ఆధ్వర్యంలో శ్రీకాంత్, మారిశెట్టి నర్సింగ్, ముచ్చకుర్తిప్రభాకర్, పద్మ తదితరులు పాల్గొని మాట్లాడుతూ గ్యాస్ ధర పెంపుతో సామాన్య , మధ్యతరగతి ప్రజలను పెనుభారంగా మారుతుందని వివరించారు.

#### లోయర్ ట్యాంక్‌బండ్‌లో..

కవాడిగూడ: కేసీఆర్ దేశ ప్రధానిగా అయితేనే ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని హోంమంత్రి మహమూద్ అలీ పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గ్యాస్ సిలిండర్‌తో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతయాదవ్, వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ కవితారెడ్డి, జూబ్లిహిల్ కార్పొరేటర్ వెంకటేష్, హిమాయత్‌నగర్, గన్‌ఫౌండ్రీ మాజీ కార్పొరేటర్ హేమలతయాదవ్, మమత, లైబ్రరీ చైర్మన్ ప్రసన్న, జాగృతి ప్రతినిధి మేఘన పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో.. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు



అంబేడ్కర్‌నగర్‌లో.. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

## మున్నూరు కాపుల అభ్యున్నతికి కృషి



రాజ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న రవీందర్‌పటేల్, ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్ర భవనం చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడిగా టి.రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ ఉప్పు రవీందర్‌పటేల్ గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా రాజ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. మున్నూరు కాపుల అభ్యున్నతి, నిత్య అన్నదాన సత్ర భవన నిర్మాణం, అభివృద్ధి, సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కాల పరిమితి రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు.

## బైరి నరేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వరంగల్ జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు బైరి నరేష్‌పై దాడి చేయడాన్ని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ తీవ్రంగా ఖండిస్తుందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, కె.పర్వతాలు తెలిపారు. నరేష్‌కు రాష్ట్ర ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పోలీసుల సమక్షంలోనే దాడి చేయడం పోలీసుల ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉందన్నారు. ఇటీవల కాలంగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడుతున్న ఘటనలు పెరగడం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను సవాలుగా మారిందన్నారు.

## చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్

రాంగోపాల్‌పేట్: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను గోపాలపురం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, డీఐ కోటయ్య వివరాల ప్రకారం.. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన ఖాజా హుస్సేన్ (22), షమీర్ ముబ్బ (20), గుల్లా అలియాస్ రియాజ్ (23) స్నేహితులు. విలాసాలకు అలవాటు పడిన ముగ్గురు దొంగతనాలకు అలవాటు పడ్డారు. వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనానికి పాల్పడుతారు. గతంలో పలు కేసుల్లో జైలు జీవితం గడిపి వచ్చినా కూడా వీరిలో మార్పు రాలేదు. రెజిమెంటల్‌బజార్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి గత నెల 25న గృహ ప్రవేశానికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ల్యాప్‌టాప్, టీవీ, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదే రోజు అదే బిల్డింగ్‌లోని మరో ఇంట్లో కూడా దొంగతనం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని డీఎస్సై పాండు ఆధ్వర్యంలో క్రైమ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

## అర్హులకు ఆయుష్మాన్ భారత్ బీమా

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'ఆయుష్మాన్ భారత్ బీమా యోజన పథకం 'కార్డులను అర్హులందరూ తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి కోరారు. గురువారం డివిజన్‌లో అర్హులైన కొందరికి ఈ కార్డులను ఆమె పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రతి పేద కుటుంబానికి ఆయుష్మాన్ భారత్ బీమా పథకం ఎంతో దోహదపడుతుందన్నారు.

## పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు అడ్డుకున్న విద్యార్థుల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరుగుతున్న పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను అడ్డుకున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ తెలుగుశాఖలో జరుగుతున్న పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల అర్హత మార్కుల వివాదం కోర్టులో ఉండగా ఇంటర్వ్యూలు ఎలా నిర్వహిస్తారని డీన్, హెడ్, బీవోఎస్‌లను ప్రశ్నించారు. పెద్ద ఎత్తున నినాదాలతో ఇంటర్వ్యూలు జరగకుండా అడ్డు పడుతుండగా పోలీసులు వచ్చి వారికి అరెస్టు చేసి తీసుకెళ్లారు.

## రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి



ధనుంజయ్ (ఫైల్)

చిక్కడపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడు మృతిచెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీలో నివసించే ధనుంజయ్ తాతాజీ (28) ఎర్రగడ్డలోని రామకృష్ణ యునానీ ఆస్పత్రిలో డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లి నుంచి చిక్కడపల్లికి తన బైక్‌పై వస్తుండగా ఆర్టీసీ క్రాస్‌రోడ్ మెట్రో స్టేషన్‌కు వద్ద అదుపుతప్పి కింద పడిపోయారు. అదే సమయంలో వేగంగా వచ్చిన డీసీఎం ధనుంజయ్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటినా గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ గఫార్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరి సవిత ఫిర్యాదు చేసింది.

## రైలు ఎక్కబోతూ పడి వ్యక్తి మృతి



మృతి చెందిన షేక్ అన్సారి

కాచిగూడ: రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం పైన రేపల్లెకు వెళ్లే రైలు ఎక్కబోతూ ప్రమాద వశాత్తు పట్టాల మధ్యలో పడి ఓ ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం రాత్రి దాదాపు 11 గంటల సమయంలో గుంటూరు ప్రాంతానికి చెందిన షేక్ ముస్తాఫా కుమారుడు షేక్ అన్సారి(53) తెనాలి వెళ్లేందుకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రెపల్లెకు వెళ్లే రన్నింగ్ ట్రైన్ ఎక్కబోయి కింద పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మోడల్‌కాలనీ పార్కు అదుర్స్



సనత్‌నగర్: సనత్‌నగర్ మోడల్ కాలనీ పార్కు హార్టికల్చర్ శాఖ నుంచి రాష్ట్రంలోనే మొదటి బహుమతి దక్కించుకుంది. ఈ శాఖ ఆధ్వర్యంలో 7వ గార్డెన్ ఫెస్టివల్, అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ పార్కు ప్రథమ బహుమతి దక్కించుకోవడం గమనార్హం. ఎర్రగడ్డ-ముంబాయి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మోడల్ కాలనీ అసోసియేషన్ కొన్ని దశాబ్దాల క్రితమే కాలుష్య నియంత్రణ కోసం ఈ పార్కును అభివృద్ధి పర్చింది. మిగతా పార్కుల కన్నా భిన్నంగా ఎక్కడ చూసినా పచ్చదనం, అందమైన ఆకృతులతో మొక్కలను పెంచారు. అశ్వగంధ, అర్జునా అరిష్టా, రాధామనోహరం, అరటి, ఎర్ర, తెల్ల మందారం, ఎర్రజాజి, మల్లె ఇలా విభిన్న రకాల పువ్వులు, పండ్లు, ఔషధ మొక్కలతో నిండి ఉంది. వర్షం నీటిని ఒడిసి పట్టేలా ఇంకుడు గుంతలు, మొక్కల ఎరువును సైతం పార్కులోనే తయారు చేసే వర్మీ కంపోస్టు యూనిట్‌ను కూడా ఏర్పాటు చేశారు. గతంలో స్వచ్ఛ అవార్డును కూడా దక్కించుకున్న ఈ పార్కు ఇప్పుడు రాష్ట్రంలోనే మొదటి అవార్డును దక్కించుకోవడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



బీపీ పరీక్ష చేయించుకుంటున్న ముఠాగోపాల్

చిక్కడపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. హోమియోపతి క్లినిక్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డాక్టర్ ఎస్.సాయికృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్.సాయికృష్ణ మాట్లాడుతూ.. దాదాపు వందకు పైగా మంది వైద్యపరీక్షలు చేయడంతో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, డాక్టర్లు పవన్, భవానీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు రాంనాథంగుప్తా, శ్యాంప్రసాద్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, నగర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## 'శ్రీ చైతన్య' యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి



సంస్థ చైర్మన్ బీఎస్ రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కవాడిగూడ: ఇంటర్ విద్యార్థి సాత్విక్ మరణానికి కారకులైన నార్సింగి శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హత్య కేసు నమోదు చేయాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచెర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నార్సింగి శ్రీ చైతన్య కళాశాల సంస్థ చైర్మన్ బీఎస్.రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం విక్రమ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ కళాశాలలతో కుమ్మక్కై విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాంకుల పేరుతో ముక్కుపచ్చలారని విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఆరోపించారు. 24 గంటల్లో బీఎస్.రావును అరెస్టు చేయాలని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గొడుగు మహేష్‌యాదవ్, గణేష్‌రామ్, భాస్కర్, ఇంద్ర రజక పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెంకట కిషన్



వెంకటకిషన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెంకట కిషన్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గురువారం ఆయనకు అందజేశారు. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సంఘటిత ఉద్యమాలు చేపట్టాలన్నారు. వెంకట కిషన్ మాట్లాడుతూ... బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేలా పనిచేస్తానన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, భూపేష్ సాగర్, కోల జనార్ధన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీ

చిక్కడపల్లి: వీధి కుక్కల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ సూచించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి ఆంధ్రావిద్యాలయం స్కూల్‌లో వీధి కుక్కల బెడదపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కుక్కల ఉన్నచోటు నుంచి విద్యార్థులు, పిల్లలు దూరంగా నడవాలని సూచించారు. పిల్లలతో ఉన్న తల్లి కుక్కలను రాళ్లతో కొట్టడంలాంటి పనులు చేయరాదన్నారు. కుక్క కరచిన వెంటనే ధారగా వచ్చే నల్లా కింద సబ్బుతో 10 నిమిషాలపాటుగాయాన్ని కడగాలన్నారు. వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించి రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని కార్పొరేటర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ యూసీడీ అధికారులు మధు, ఉస్మాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'బహుజన మేధావి బూర నర్సయ్యగౌడ్'



బూర నర్సయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న బాలరాజుగౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భువనగిరి పార్లమెంట్ మాజీ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ బహుజన మేధావని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వాయ కమిటీ చైర్మన్ బాలగోనీ బాలరాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన జన్మదినం పురస్కరించుకోని సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బూర నర్సయ్యగౌడ్‌ను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సయ్యగౌడ్ పేద దళిత బహుజన ఐక్యత కోసం ఎంతో కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చాగోని శ్రీనివాస్‌గౌడ్, హరిశంకర్‌గౌడ్, అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయుతనివ్వాలి

అంబర్‌పేట: పేద విద్యార్థుల ఉన్నత విద్యకు బడ్జెట్ పాఠశాలల కృషి ఎంతో ఉందని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు బడ్జెట్ పాఠశాలలు నియోజకవర్గంలో తమ వంతు సహకారం అందిస్తున్నాయన్నారు. అంబర్‌పేట మండలం ప్రభుత్వ గుర్తుంపు పొందిన ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆయన గురువారం అంబర్‌పేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల పేరిట తీవ్ర ఒత్తిడి తేవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవికుమార్, మధుసుదన్, రవి, జి.శోభారెడ్డి, డాక్టర్. చంద్ర మోహన్, మెబిన్ తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

## ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

చిక్కడపల్లి: తెలంగాణ జాగృతి సరస్వతి అకాడమీ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగాన సభలో నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టున్నాయి. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్ అకాడమీ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మై స్టెప్స్ డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో విద్యార్థులు శ్రేయాస్, తేజస్విని, ఈశ్వర్, భార్గవి, హిమాంశ్, సహర్ష్, అరైనా, నిత్య రెడ్డి గీతిక, దీపక్, శివాని, రుతికలు, విఘ్నేశ్వర్ కొరియోగ్రఫీలో పలు ఆధునిక, జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విక్కీ, మాస్టర్ అధ్యక్షత జరిగిన సభలో మాజీ జడ్జి బూర్గుల మధుసూదన్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ పాల్గొని చిన్నారులులను ఆశీర్వదించి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ప్రదర్శించి శ్రోతలను అలరించారు.

